క్లుప్తంగా

ఎరువుల దుకాణాల తనిఖీ



జి.కొండూరు: ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందితే సదరు వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అంతర్గత తనిఖీ స్క్వాడ్ ప్రతినిధులు నందిగామ ఏడీఏ శ్రీనివాస్, మైలవరం ఏఓ సంధ్య అన్నారు. మైలవరం, జి.కొండూరు మండలాల పరిధిలోని ఎరువులు, పురుగు మందుల షాపులను గురువారం వారు తనిఖీ చేశారు. రికార్డులు, షాపులలో స్టాక్‌ను పరిశీలించారు. వారు మాట్లాడుతూ రైతులకు రబీ సాగుకు ఇబ్బంది తలెత్తకుండా డీఏపీ, యూరియా అందుబాటులో ఉండేలా చూసుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ రాంకుమార్ పాల్గొన్నారు.

శిఖా ఆకాష్‌కు ప్రతిభ పురస్కారం



నూజివీడు: ప్రముఖ అభ్యుదయ కవి శిఖా ఆకాష్ (కత్తుల కిశోర్ కుమార్) శ్రీశ్రీ కళా వేదిక తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ, బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పొయెట్రీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు కీర్తి జాతీయ ప్రతిభ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు శ్రీశ్రీ కళావేదిక సీఈఓ కత్తిమండ ప్రతాప్ ఆహ్వానాన్ని పంపారు. తెలుగు భాష, సంస్కృతి, వైభవం, సాహిత్యం, కళల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్నందున ఆయనను పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ నెల 21న విజయవాడలోని కొత్తా పూర్ణానంద కళా వేదికలో జరిగే కార్యక్రమంలో పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. ఆకాష్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



తిరువూరు: అంబేడ్కర్ ఆలోచన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు కె. ఆనంద స్వరూప్ గురువారం ఆవిష్కరించారు. కోర్టు ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మేకల నాగేంద్రప్రసాద్, మేకల రవి, సుబ్బారావు, వెంకటరెడ్డి, కనపర్తి రాంబాబు, సుబానీ తదితరులు పాల్గొన్నారు.

జేడీ తాహేరా సుల్తానాకు అభినందన



ఇబ్రహీంపట్నం: ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్ విభాగంలో జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన తాహేరా సుల్తానాను పీఆర్టీయూ ఇబ్రహీంపట్నం మండల నాయకులు గుంటూరులోని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. పీఆర్టీయూ నాయకులు మహ్మద్ ఇర్ఫాన్ పాషా, మైకేల్‌బాబు, సురేష్, అబ్దుల్లా ఖయ్యూం పాల్గొన్నారు.

కొండపల్లిలో వీధి కుక్కల పట్టివేత



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాలిటీలో విచ్చలవిడిగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వీధి కుక్కలను మున్సిపల్ అధికారులు నివారించే చర్యలు ప్రారంభించారు. స్థానిక 16వ వార్డులోని వీధుల్లో సంచరిస్తున్న శునకాలను గురువారం రింగ్ వలలతో పట్టుకుని వాహనాల్లో తరలించారు. పట్టుబడిన వీధి కుక్కలను ఏమి చేస్తారనే అంశంపై మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన స్పందిస్తూ.. విజయవాడలోని నవోదయ ఏజెన్సీతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు అక్కడకు తరలిస్తామన్నారు. వ్యాక్సినేషన్ పూర్తి అయిన తర్వాత మరలా అదే ప్రాంతంలో కుక్కలను విడిచిపెడతామని చెప్పారు.

సారా విక్రయదారుల అరెస్టు

ముసునూరు: సారా తయారు చేసి, విక్రయిస్తున్నారనే సమాచారంతో ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్, ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పీఎస్‌డీ భోగేశ్వరరావు ఆధ్వర్యంలో చెక్కపల్లిలో దాడులు నిర్వహించారు. చెక్కపల్లిలో తాళం సంపతరావు, ముసునూరులో చెంగల నాగేంద్రరావు సారా విక్రయిస్తుండడంతో గురువారం వారి ఇళ్లలో సోదాలు చేశారు. 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేశారు. ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా దాళ్వా వరి నాట్లు

- గత ఏడాది వరదలకు నష్టపోయిన రైతులు
- ఇప్పటికే 1,000 ఎకరాల్లో వరి నాట్లు పూర్తి
- మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు



మూలపాడులో దాళ్వా వరి నాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు



ఈలప్రోలు గ్రామంలో ముందస్తుగా వేసిన దాళ్వా వరి పైరు

ఇబ్రహీంపట్నం: మండలంలో దాళ్వా వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఖరీఫ్ వరి సాగులో ఇప్పటికే కోతలు కోసిన రైతులు తమ భూములను రబీ సీజన్‌కు దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్నారు. ఖరీఫ్ సీజన్‌లో వచ్చిన వరదలకు పంట పొలాలు ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొంతమంది అప్పట్లోనే తిరిగి వరి నాట్లు వేసుకోగా.. కొందరు ఇప్పుడు దాళ్వా సాగుపై దృష్టి పెట్టారు. ఇప్పటికే సిద్ధం చేసుకున్న దుక్కుల్లో అందుబాటులో ఉన్న బోర్లు, ఎన్టీటీపీఎస్ బూడిద నీటితో నారుమడులు పోసుకున్నారు. వరి నారు మడులు సిద్ధం కావడంతో పొలాల్లో ట్రాక్టర్లతో దమ్ము చేసి నాట్లు ప్రారంభించారు. ఈ ఏడాది దాళ్వా సీజన్‌లో సుమారు 1,600 నుంచి 1,800 ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖాధికారులు అంచనాలు వేస్తున్నారు. ఇప్పటికే సుమారు 1,000 ఎకరాల్లో రబీ వరి నాట్లు పూర్తి చేశారు.

ఈ ఏడాది దాళ్వాపై రైతుల మక్కువ..

గత ఏడాది సెప్టెంబర్‌లో వచ్చిన అధిక వర్షాలు, వరదల కారణంగా ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. సుమారు నాలుగు వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. ఈలప్రోలు గ్రామంలో బుడమేరు వరదకు సాగులో ఉన్న 998 ఎకరాల వరి పైరు తుడిచి పెట్టుకుపోయింది. కేంద్ర బృందం ఈ గ్రామంలో నీటి ముంపునకు గురైన వరి పొలాలను పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందించింది. రైతులు ఆ నష్టాన్ని దాళ్వాతో పూడ్చుకోవాలని ఆశిస్తున్నారు. గతంలో ఎక్కువగా ఎంటీయూ 1010 రకం విత్తనం వినియోగించేవారు. ఆ రకం ధాన్యం అమ్మకాల్లో ఇబ్బందులు తలెత్తడంతో ఈ ఏడాది ఎక్కువగా పీఆర్ 100 రకం విత్తనం వాడుతున్నారు. ఈలప్రోలుతో పాటు గుంటుపల్లిలో ప్రతి ఏడాది ఖరీఫ్‌లో వరి సాగు చేపట్టి రెండో పంటగా మినుము, పిల్లిపెసర పంటలు వేసేవారు. వరదల అనంతరం కొంతమంది మరలా వరి నాట్లు వేసుకోగా, మరి కొంతమంది ఇప్పుడు దాళ్వా నాట్లకు సిద్ధమయ్యారు. ఇప్పటికే జూపూడి, ఇబ్రహీంపట్నం, త్రిలోచనాపురం, కొటికలపూడి తదితర గ్రామాల్లో రబీ సీజన్‌లో దాళ్వా పంటగా 1,000 ఎకరాల్లో వరి నాట్లు పూర్తి చేశారు.

సాగుపై రైతులకు అవగాహన

- దాళ్వా వరి సాగులో మెలకువలపై వ్యవసాయ శాఖాధికారులు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు.
- దాళ్వా వరికి వేసవి తాకిడితో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నందున సకాలంలో నాట్లు వేసుకోవాలి.
- అవసరం మేరకు ఎరువులు వినియోగించాలి.
- రైతుల మధ్య పోటీతత్వంతో విచక్షణారహితంగా ఎరువులు వాడటం వలన సాగు ఖర్చులు పెరిగిపోవడంతో పాటు చీడపీడలు ఆశిస్తాయి.
- నాట్లు వేసిన తర్వాత జింక్ లోపాలు గమనించి సకాలంలో జింక్, నత్రజని వంటి ఎరువులు వాడాలి.
- దాళ్వాలో సకాలంలో యాజమాన్య పద్ధతులు పాటించాలి. దీని వల్ల రైతులకు ఖర్చులు తగ్గడంతోపాటు అధిక దిగుబడులు సాధించవచ్చు.

మెలకువలు పాటించాలి



దాళ్వాలో మెలకువలు పాటించడం ద్వారా సకాలంలో పంట దిగుబడి వస్తుంది. నాట్లు వేసే సమయంలో నారు చివర్లు అంగుళం మేర తుంచాలి. ఈ పద్ధతిలో నారుపై ఉండే కాండం తొలిచే పురుగు నివారించబడుతుంది. సార్వా నాట్లలో సుమారు 33 కుదుళ్లు నాటతారు. దాళ్వా పంట సమయం తక్కువ కాబట్టి 44 కుదుళ్ల వరకు నాటుకోవాలి. కలుపు, నీరు, ఎరువుల యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి వస్తుంది.

– డి.శైలజ, వ్యవసాయాధికారి, ఇబ్రహీంపట్నం

రైతులకు 9 గంటలు విద్యుత్ సరఫరా చేయాలి

రైతు సంఘం డిమాండ్

మైలవరం: రైతులకు పగటి పూట 9 గంటలు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని రైతు సంఘం మైలవరం మండల అధ్యక్ష, కార్యదర్శులు వజ్రాల వెంకటరెడ్డి, రావుల సుబ్బారావు డిమాండ్ చేశారు. మైలవరంలోని రైతు సంఘం కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రైతులకు పగటి పూట 9 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 9 గంటల నుంచి 8 గంటలకు తగ్గించిందని, ప్రస్తుతం 7 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తున్నారని చెప్పారు. ఈ విధంగా కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని విమర్శించారు. గత రెండు రోజుల నుంచి ఏడు గంటలే విద్యుత్ ఇవ్వడంతో పంటలకు సక్రమంగా నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సకాలంలో పంటలకు సరిపడా నీటి తడులు ఇవ్వక పోవడంతో పంటలు ఎండిపోయే అవకాశం ఉందన్నారు. ఎప్పటిలాగే 9 గంటలు నాణ్యమైన విద్యుత్‌ను పగటి పూట ఇవ్వాలని కోరారు.

క్రీడా పోటీలు ప్రారంభం

మైలవరం: దివంగత మన్నె ప్రభుదాసు, జయకుమార్, శ్రీను జ్ఞాపకార్థం ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో రెడ్డిగూడెం గ్రామంలో యువతకు షటిల్, క్యారమ్స్, మహిళలకు టెన్నికాయిట్, కబడ్డీ పోటీలు గురువారం ప్రారంభించారు. ఈ పోటీలు రెండు రోజుల పాటు జరుగుతాయని ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు చాట్ల విజయ్‌కుమార్ తెలిపారు. విజేతలకు ఈ నెల 18న జరిగే కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో రెవరెండ్ జి. విశ్వనాథ్, మన్నె శాంతికుమార్, బండపల్లి ప్రేమ్‌కుమార్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాహకుల బరి తెగింపు

- కాకర్లలో కొనసాగిన కోడి పందేలు
- అడ్డుకున్న పోలీసులు
- పట్టించుకోని అధికార పార్టీ నేతలు



తిరువూరు మండలం కాకర్లలో పందేలను అడ్డుకున్న పోలీసులు

తిరువూరు: సంక్రాంతి పండుగ జూదాలు తిరువూరు మండలంలోని కాకర్లలో గురువారం కూడా కొనసాగాయి. ఉదయం 10 గంటలకే పలు గ్రామాల నుంచి వచ్చిన పందెం రాయుళ్లు బరి వద్ద మోహరించారు. నిర్వాహకులు పందేలు వేస్తుండగా గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సుమారు రెండు గంటల పాటు పందేలు కొనసాగాయి. తిరువూరు ఎస్‌ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు కాకర్లలోని కోడి పందేలపై దాడి చేసి పందేలను అడ్డుకున్నారు.

గ్రామస్తుల ఆగ్రహం..

సంక్రాంతి పందేల పేరుతో పలు ప్రాంతాల నుంచి వచ్చిన అపరిచిత వ్యక్తులు గ్రామంలో విచ్చలవిడిగా సంచరిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తుండటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నివాసాల వద్దే మద్యం సేవించడం, వాగ్వివాదాలకు దిగడంతో మహిళలు అసౌకర్యానికి గురయ్యారు. పందేలు కొనసాగితే తాము పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.

సామాజిక పెన్షన్ల తనిఖీ

తిరువూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సామాజిక పెన్షన్లను అధికారులు తనిఖీ చేశారు. లక్ష్మీపురంలో డయాలసిస్ రోగులు, దివ్యాంగుల పెన్షనర్ల వివరాలను ఎంపీడీఓ రవిబాబు, వైద్యురాలు పూజిత పరిశీలించారు. అర్హతలున్న పెన్షనర్లను గుర్తించేందుకు తనిఖీ చేపట్టామని ఎంపీడీఓ తెలిపారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

19న త్యాగరాజు ఆరాధనోత్సవాలు

నూజివీడు: సద్గురు త్యాగరాజు స్వామి ఆరాధనోత్సవాలను నూజివీడులో ఈ నెల 19న నిర్వహిస్తామని శ్రీ సత్య నృత్య సంగీత అకాడమీ నిర్వాహకులు వేంపాటి మోహన్ గురువారం తెలిపారు. పట్టణంలోని అమర్ భవన్‌లో ఉదయం తొమ్మిది నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ఆరాధనోత్సవాలను నిర్వహిస్తామన్నారు. శాస్త్రీయ సంగీతం, శాస్త్రీయ నృత్యాలు, పంచరత్న కృతులు తదితర అనేక కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

- తిరువూరు: ఈ నెల 18 నుంచి తిరువూరులో త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. పాత బస్టాండు సెంటర్‌లోని చంద్రమౌళీశ్వరాలయ ప్రాంగణంలో మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు. హరికథాగానం, సంగీత కచేరీ తదితర కార్యక్రమాలుంటాయని చెప్పారు.

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు



బాల్య వివాహాల నిరోధంపై ప్రచారం చేస్తున్న వినోద్‌కుమార్ తదితరులు

నూజివీడు: బాల్య వివాహాలు చేయడం వలన భవిష్యత్‌లో ఆడపిల్లలు తీవ్ర అనారోగ్యానికి గురవుతారని, పోలసానపల్లిని బాల్య వివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్తులు సహకరించాలని చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆర్.వినోద్ కుమార్ అన్నారు. పోలసానపల్లిలో గురువారం బాల్య వివాహాల నిరోధంపై ప్రచారోద్యమ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చట్ట ప్రకారం బాలుడికి 21 ఏళ్లు, బాలికకు 18 ఏళ్ల వయస్సు నిండకుండా వివాహాలు చేయకూడదన్నారు. చిన్న వయస్సులోనే ఆడ పిల్లలకు వివాహం చేయడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని చెప్పారు. రక్తహీనత, శారీరక సమస్యలు, రుగ్మతలు, ఆర్థిక ఇబ్బందులు తదితర సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చూడటం అందరి బాధ్యత అని చెప్పారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే 112, 1098 నంబర్లకు సమాచారాన్ని అందజేయాలని, సమచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతారన్నారు. ప్రతి గ్రామాన్ని బాల్య వివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దినట్లయితే జిల్లా, రాష్ట్రం, దేశం బాల్య వివాహ రహిత దేశంగా మారుతుందన్నారు. దీనిలో భాగంగా బాల్య వివాహం వద్దు, చదువే ముద్దు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కల్యాణి, అంగన్‌వాడీ టీచర్ సుజాత, సీఎస్‌డబ్ల్యూ కె.కృష్ణవేణి, పి.వెంకటేశ్వరరావు, ఆశా వర్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

రూ. 6.18 లక్షల జరిమానా

విస్సన్నపేట: మండలంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. గృహావసరాలు, వాణిజ్య సముదాయాల విద్యుత్ సర్వీసులను తనిఖీ చేసిన అధికారులు అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న 138 సర్వీసులకు రూ. 6 లక్షల 18 వేల 800 జరిమానా విధించారు. విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 40 బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయి. 2,118 గృహ సర్వీసులను, 264 వాణిజ్య సముదాయాలను అధికారులు తనిఖీ చేశారు. ఈఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 221 కిలోవాట్ల అదనపు లోడు వినియోగిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. అనుమతించిన కేటగిరీ కాకుండా ఇతర కేటగిరీ వాడుతున్న ఇద్దరు వినియోగదారులపై రూ.2 వేల జరిమానా విధించామన్నారు. మీటరు లేకుండా విద్యుత్ చౌర్యం చేస్తున్న మరో 8 మందిపై రూ.8 వేలు జరిమానా విధించామని చెప్పారు. తనిఖీల్లో నూజివీడు ఈఈ ఎ. సత్యనారాయణ, విస్సన్నపేట ఏఈ విజయ భాస్కర్, నూజివీడు డివిజన్ పరిధిలోని డీఈలు, ఏఈలు, జేఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కంకర వేశారు.. రోడ్డు మరిచారు !



మల్లిబోయినపల్లి నుంచి కొత్త ఈదర మధ్య రోడ్డు దుస్థితి

ఆగిరిపల్లి: మండలంలోని మల్లిబోయినపల్లి నుంచి కొత్త ఈదర వరకు చేపట్టిన తారు రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. పనులు పూర్తి చేసే విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ చొరవ చూపడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. కంకర పోసి వదిలేసిన రోడ్డుపై రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కృషితో మల్లిబోయినపల్లి గ్రామస్తుల చిరకాల కోరికను నెరవేర్చారు. నాలుగు కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి రూ.3.70 కోట్లను మంజూరు చేయించి పనులు ప్రారంభించారు. ఇంతలో ఎన్నికలు రావడంతో రోడ్డు నిర్మాణ పనులను నిలిపి వేశారు. నూతన ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలు అవుతున్నా రోడ్డు నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరితగతిన రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.

రోడ్లపై అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్



చిన్న గాంధీబొమ్మ సెంటర్‌లో కారును నిలిపి ఉంచడంతో వెళ్లడానికి వీలులేక నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు



నూజివీడులోని జంక్షన్ రోడ్డులో హోటల్ ఎదుట రోడ్డుపైనే నిలిపి ఉంచిన వాహనాలు

- రాకపోకలకు ఇబ్బందులు
- పట్టణ ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు

నూజివీడు: పట్టణంలో రహదారులపైనే కార్లు, ఆటోలను పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు పెరుగుతున్నాయి. ఇరుకు రోడ్లు కావడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో పట్టణ ప్రజలు సతమతమవుతుండగా, దీనికి తోడు కార్లు, ఆటోలను రోడ్లపై ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేసి గంటల తరబడి ఉంచుతుండటంతో ట్రాఫిక్ కష్టాలు మరింత పెరుగుతున్నాయి. ఎవరికి వారు ఇష్టారాజ్యంగా వాహనాలను రోడ్లపై నిలిపివేస్తున్నా పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. హోటళ్లు, బంగారం దుకాణాలు, చెప్పుల షాపులు, బట్టల దుకాణాలు, బ్యాంకులు, లాడ్జీల వద్ద వాహనాలను రోడ్డుపైనే నిలిపి ఉంచడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. పోలీసు అధికారులు స్పందించి రోడ్లపై వాహనాలు నిలుపకుండా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

22న బలివే ఉత్సవాల ఏర్పాట్లకు బహిరంగ వేలం

ముసునూరు: చారిత్రక ప్రసిద్ధ శైవ క్షేత్రం బలివేలో మహా శివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 25 నుంచి 28 వరకు నిర్వహించనున్న బలే రామలింగేశ్వర స్వామి మహోత్సవాల్లో ఏర్పాట్లు చేసేందుకు ఈనెల 22న టెండర్ కం బహిరంగ వేలం నిర్వహిస్తామని ఆలయ ఈఓ పామర్తి సీతారామయ్య తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆలయం వద్ద విద్యుద్దీపాలంకరణ, మైక్ సెట్లు, షామియానా సామగ్రి సప్లై, లడ్డూ ప్రసాదం తయారీకి బ్రాహ్మణ వంట మనుషులు, పచారీ సరుకులు, భోజన, ఫలహారాల సప్లై, క్యూ లైన్లకు బాదుల సప్లై, పర్వ దినాల్లో పనులు చేయుటకు కూలీలకు 22న ఉదయం 11 గంటలకు టెండర్ కం బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తిగల వారు ఈనెల 21 వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా టెండర్ ఫామ్స్ అందజేసి, సకాలంలో వేలానికి హాజరు కావాలని కోరారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి



వత్సవాయిలో సాగులో ఉన్న వేరుశనగ పంట

వత్సవాయి: వాణిజ్య పంటలను సాగుచేస్తూ ప్రతిసారి నష్టాలను చవిచూస్తున్న రైతుల్లో మార్పు కనిపించి ప్రత్యామ్యాయ పంటల సాగుపై ఇప్పుడిప్పుడే దృష్టి సారిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో మండలంలో 13 వేల ఎకరాల్లో పత్తి పంటను సాగుచేశారు. వాతావరణ పరిస్థితుల ప్రభావంతో ఆశించిన స్థాయిలో దిగుబడులు లేవు. మంచి పూత, పిందెల దశలో ఉన్నప్పుడు పడిన అకాల వర్షాలకు పూత, పిందె మొత్తం రాలి నష్టపోయారు. డిసెంబర్‌లోనే పత్తి పంట పూర్తికావడంతో పంటను తొలగించారు. నాలుగు నెలలపాటు పొలాన్ని ఖాళీగా ఉంచడానికి ఇష్టపడని రైతులు కొందరు నీటి అవకాశం ఉన్నవారు మొక్కజొన్న, వేరుశనగ పంటపై దృష్టి సారించారు. గోపినేనిపాలెం, మంగొల్లు, కన్నెవీడు, వత్సవాయి, మక్కపేట, కంభంపాడు ఇందుగపల్లి ప్రాంతాల్లో పంటను సాగుచేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో శనగ విత్తనాలు కూడా హైబ్రిడ్ రకం రావడంతోపాటు పంటమార్పిడి కారణంగా వేరుశనగ దిగుబడులు కూడా బాగానే వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ఎకరానికి 20 నుంచి 30 బస్తాల వరకు దిగుబడులు రానున్నాయి. నీటి వసతి అందుబాటులో ఉన్నవారు ఎక్కువగా ఈ పంటపై ఆసక్తి చూపుతున్నారు. మండలంలో ప్రస్తుత సీజన్‌లో 100 ఎకరాల వరకు పంటను నాటారు. పెట్టుబడులు తక్కువతోపాటు శ్రమ కూడా పెద్దగా ఉండదని రైతులు చెబుతున్నారు.

మౌలిక సదుపాయాల లేమిపై ఫిర్యాదు

తిరువూరు: స్థానిక 17వ వార్డులో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని సామాజిక కార్యకర్త రాంప్రదీప్ అన్నారు. మౌలిక సదుపాయాలు లేమిపై తిరువూరు ఆర్ఐ మాధురికి గురువారం ఆయన ఫిర్యాదు చేశారు. వార్డులో ప్రజలకు తాగునీరు, రోడ్ల సదుపాయం లేక నివాసయోగ్యంగా లేదని, అపార్ కార్డు పొందే విద్యార్థులకు జనన ధ్రువీకరణ పత్రాలు నగర పంచాయతీ నుంచి అందక ఇబ్బంది పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

తోలుకోడులో 'పొలం పిలుస్తోంది'

మైలవరం: సాగులో సమస్యలు ఉంటే వ్యవసాయ శాఖాధికారుల దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి తగిన సహాయ, సహకారాలు అందిస్తామని వ్యవసాయ శాఖ మైలవరం ఏడీ శ్రీనివాసరావు తెలిపారు. మైలవరం మండలం తోలుకోడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం జరిగింది. ఏడీ మాట్లాడుతూ పంట మార్పిడి విధానం, చిరుధాన్యాల సాగు ద్వారా పంట దిగుబడి ఎక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖాధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం

రూ. 1.30 లక్షలతో సైకిల్‌స్టాండ్



పూర్వ విద్యార్థులతో కలిసి సైకిల్ స్టాండ్‌ను ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

జుజ్జూరు(వీరులపాడు): జుజ్జూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 2005 పదో తరగతి విద్యార్థులు పాఠశాల ఆవరణలో కలుసుకుని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తాము చదువుకున్న తరగతి గదులను, పాఠశాల ఆవరణలో తిరుగుతూ పాత మిత్రులతో కుశల విషయాలను తెలుసుకుని భావోద్వేగానికి గురయ్యారు. నృత్యాలు, ఆటలు, కబుర్లతో సరదాగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పి తమ ఉన్నతికి కృషి చేసిన అలనాటి ఉపాధ్యాయులు రాయల కోటేశ్వరరావు, కొమ్మూరి శేషు, యరమాల నాగిరెడ్డి, భాను నాయక్, షేక్ ఖాదర్ బాబులను ఘనంగా సత్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం రూ. 1.30 లక్షల పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాల ఆవరణలో నిర్మించిన సైకిల్ స్టాండ్‌ను ఉపాధ్యాయులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గోపయ్య మృతి తీరని లోటు

పెనుగంచిప్రోలు: స్థానిక మునేరు ఎత్తిపోతల పథకం మాజీ చైర్మన్ కాకాని గోపయ్య మరణం పార్టీకి తీరని లోటని నెడ్‌క్యాప్ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవి కుమార్ అన్నారు. గోపయ్య సంస్మరణ సభ గురువారం పెనుగంచిప్రోలులో నిర్వహించారు. గోపయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, మాజీ హోంమంత్రి వసంత నాగేశ్వరరావు, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.